క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఆమదాలవలస రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల ఆమదాలవలస కార్యవర్గం (సమితి) ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వై.వనజాక్షి, ప్రధాన కార్యదర్శి కేవీ రమణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా కె.గీత, కోశాధికారిగా యు.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.ఆదవిరాముడు, పి.అరుణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించారు. సమితి ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో పలువురు ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అదనపు పరిహారం చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామారావు

ఎల్.ఎన్.పేట: వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం విడుదల చేసిన అదనపు పరిహారం నిధులు చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మంగళవారం కలిశారు. నిర్వాసితుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన అదనపు పరిహారం డబ్బులు కొందరికి చెల్లించటం జరిగిందన్నారు. కొంతమంది నిర్వాసితులకు చెల్లింపులు చేయకపోవటం వల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిగిలిన వారికి అదనపు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం పనులు మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధితో పాటు పెరటి నుంచి ఉన్న చొర్లంగి రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ పూడిక పోయింది. దీంతో వాడిక, వర్షం నీరు వీధుల్లో నుంచి రోడ్డు పైనుంచి ప్రవహించేంది. ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ పూడికపోవటం వల్ల గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తి చేసినందుకు గ్రామ సచివాలయానికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.20లక్షల నిధులతో డ్రైనేజీ పనులు చేపడుతున్నామని వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, సర్పంచ్ ఈగల భవాని తెలిపారు.

బస్సు యాత్రకు స్పందన కరువు



నరసన్నపేట: మడపాం వద్ద బస్సు యాత్ర

నరసన్నపేట: భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టీడీపీ నాయకులు నరసన్నపేటలో నిర్వహించిన బస్సు యాత్రకు అంతంతగానే స్పందన లభించింది. ఆ పార్టీ కార్యకర్తలు మినహా ప్రజలు అసలు పట్టించుకోలేదు. ఉదయం 9 గంటలకు మడపాం వద్ద ప్రారంభించాల్సిన యాత్ర 11 గంటలకు మొదలైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మడపాంలో ర్యాలీ ప్రారంభించి వెళ్లిపోయారు. దీంతో కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. అనంతరం మాకివలస మబుగాం, వనిత మండలం, కిల్లాం ఈదులవలస మీదుగా నరసన్నపేటకు యాత్ర చేరుకుంది. ఇక్కడకు వచ్చే సరికి బస్ యాత్ర పలచబడింది. కోమర్తి, ఉర్లాం, చోడవరం, తిమడాం మీదుగా బుడితి వరకు యాత్ర సాగింది. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: టీడీపీ బస్సు యాత్ర మండలం పరిధి తిమడాంలో మంగళవారం రాత్రి మమ అని ముగించారు. ముఖాముఖికి మహిళలు వచ్చేందుకు ఆసక్తి చూపకపోవడంతో వారిని సభా వేదిక వద్దకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినప్పటికీ ఎవరూ వెళ్లలేదు. దీంతో నాయకులు బస్ కూడా దిగకుండా ముందుకు సాగారు. స్థానిక నాయకులు బస్ దిగమని కోరగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఐదు నిమిషాలు మాట్లాడి ముగించారు. గతంలో తమ ఓట్లతో గద్దెనెక్కిన చంద్ర బాబు సున్నా వడ్డీకి మంగళంపాడారని మహిళలు గుసగుసలాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక టీడీపీ నాయకులు ఊసూరు మంటూ వెనుదిరిగారు.



పాతపట్నం: ఆర్.ఎల్.పురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి:చిగురువలసలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగనన్న సురక్షతో.. అర్హులందరికీ లబ్ధి



కొత్తూరు: కుంటిభద్రలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గ్రామాల్లో ఓ ఉద్యమంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో అర్హులకు గంటల వ్యవధిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. మంగళవారం పలు గ్రామాల్లో అర్జీదారులకు జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. ఈ కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: వంజంగిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



సారవకోట: కేళవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి



నరసన్నపేట: బొరిగివలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



జలుమూరు: ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ



మెళియాపుట్టి: మర్రిపాడు-సి సచివాలయంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పొందూరు: దివ్యజ్ఞాన సమాజంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సచివాలయాలతో మెరుగైన సేవలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

• స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: దేశ చరిత్రలోనే పాలనలో విప్లవాత్మకమన మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ఉప్పినివలస గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. సచివాలయం సిబ్బంది అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా, లేదా అనే అంశాలపై ఆరా తీశారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలు గ్రామస్తులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేలా చొరవ చూపాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే వచ్చాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ బలరాంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటరావు, గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

• నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మాళువ గ్రామంలో ఉపాధి హామీ పథకం, మండల పరిషత్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, బస్ షెల్టర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా అర్హత కలిగిన ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. ఒక కుటుంబం ఆర్థికంగా బలపడాలంటే.. ఆ కుంటుంబంలో ఉన్న పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సారవకోట మండలం ఐటీడీఏ పరిధిలో ఉండటంతో జగనన్న కాలనీల నిర్మాణాలు జరగలేదని, త్వరలోనే నిర్మాణాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలియజేశారు. సర్పంచ్‌లు కనకమ్మ, పల్లి శ్రీహరి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, జేసీఎస్ చైర్మన్ నక్క తులసీదాస్, మాజీ సర్పంచ్‌లు నక్క రామారాజు, పల్లి కృష్ణారావు, కాళ్ల సింహాచలం, మామిడి కాంతారావు పాల్గొన్నారు.

వైద్య సేవలపై సబ్ కలెక్టర్ అసంతృప్తి



వైద్యులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, ఓపీ, ఆస్పత్రి ప్రసవాలపై ఆరా తీశారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నా.. ఒక్క ప్రసవం కూడా జరగడం లేదని తెలియడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో తాను పీహెచ్‌సీ పరిశీలించి పలు సూచనలు చేసినా.. తీరు మారలేదన్నారు. ప్రసవాల కోసం బుడితి సీహెచ్‌సీ వైద్యుల దగ్గర చూసి నేర్చుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న భూ సర్వేపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హనుమంతరావు, పీహెచ్‌సీ వైద్యులు వాన దేవిక, సౌమ్య, ఆర్ఐ బేగం ఉన్నారు.

విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతు చింతాడ రవికుమార్

ఆమదాలవలస: భవిష్యత్ తరాలకు అందజేయగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమే అని నమ్మి, విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో చంద్రబాబు.. ప్రభుత్వ విద్యకు బడ్జెట్లో 1.1 శాతం కంటే తక్కువ నిధుల కేటాయించడంతో లక్షల మంది పిల్లల డ్రాపౌట్స్‌కు కారణమయ్యాడన్నారు. 2014 నుంచి 2019 మధ్యలో సుమారు 5 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్నారు.

చంద్రబాబు ఆలోచన ఎప్పుడూ నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించడమేనని గుర్తుచేశారు. 2019లో ఆయన పదవి నుంచి దిగేటప్పటికి ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.18850 కోట్లు ఉంచారన్నారు. అలాంటి పరిస్థితుల్లో అధికారం చేపట్టిన సీఎం జగనన్న ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే దిశగా నాడు-నేడు, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్యను 37 లక్షల మంది నుంచి 44 లక్షల మందికి చేర్చారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా 52,60,000 మంది తల్లుల ఖాతాలో రూ.26,000 కోట్లు, విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా 44 లక్షల మంది విద్యార్థుల ఖాతాలో రూ.14,000 కోట్లు జమ చేశారని తెలిపారు. నాడు-నేడు ద్వారా రూ.7 వేల కోట్లతో 37 వేల ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. చంద్రబాబు హయాంలో విద్యలో మన రాష్ట్రం దేశంలో 24వ స్థానంలో ఉంటే ప్రస్తుతం 7వ స్థానానికి చేరుకుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగనన్నకు ప్రతి ఒక్కరూ తోడుగా ఉండాలని కోరారు.

పీఎంఈజీపీతో మహిళల ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏసీ కొండలు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలతో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళా శక్తి పెరుగుతోందని, తాజాగా పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) మరింతగా దోహదపడుతోందని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ కె.కొండలు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం పీఎంఈజీపీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కచ్చితంగా ఆదాయమార్గాలు చూపేందుకు ఈ పథకం ఉపకరిస్తుందన్నారు. రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చని, దీంట్లో 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. దీనిని మహిళా లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు మేనేజర్లు గౌతమ్, అలెగ్జాండర్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న మహిళలు ఉంటే వారికి ఈ పథకంలో రుణాలు ఇస్తామని, కుటుంబ ఆర్థికస్థోమత మెరుగు పరుచుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. నరసన్నపేట ఏసీ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన లబ్ధిదారులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట సీఐగా ప్రసాదరావు



నరసన్నపేట: నరసన్నపేట సీఐగా బూర ప్రసాదరావు మంగళవారం నియమితులయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన సీఐ డి.రాముకు బదిలీ అయింది. ప్రస్తుతం ప్రసాదరావు శ్రీకాకుళం క్రైమ్ డీసీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

హిరమండలం: గ్రంథాలయాలను నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. మొత్తం ఎన్ని పుస్తకాలు ఉన్నాయి, రోజూ ఎంతమంది వస్తుంటారని గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్యం పుస్తకం కావాలని సబ్ కలెక్టర్ అడుగగా.. గ్రంథాలయధికారి తీసి ఇవ్వలేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపుస్తకం కావాలన్నా తీసి ఇవ్వగలిగేలా అమర్చుకోవాలన్నారు. నిరుద్యోగులకు సంబంధించిన పుస్తకాలు ఏం అవసరమో తెలియజేస్తే వాటిని పంపిస్తామన్నారు. గ్రంథాలయాన్ని ఎప్పటికప్పుడు ఎంఈఓ, ప్రజాప్రతినిధులు సందర్శించాలన్నారు. ఎంఈఓ కె.రాంబాబు, సర్పంచ్ ఎందవ ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ ఉన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

బూర్జ: ప్రతీ ఉద్యోగికి తాను విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు అన్నారు. హౌసింగ్ ఏఈగా మండలంలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన టి.వెంకటరమణను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎస్.ఉదయ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇన్‌చార్జి ఏఈ కె.లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, బూర్జ, పొందూరు హౌసింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దు



మాట్లాడుతున్న లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని, అధికారం కోసం వారు చెప్పే మాయమాటలను నమ్మవద్దని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా సైనికులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే కృషిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ చేస్తున్న ప్రతీ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మాజీ సర్పంచ్‌లు లోతుగెడ్డ తాతబాబు, పడాల వెంకటకృష్ణ, పార్టీ నాయకులు రేగేటి కన్నయ్య స్వామి, కొయిలాపు సంజీవరావు, అగతమూడి రంజిత్, అప్పారావు పాల్గొన్నారు.

చాపర ఆశయాలను కొనసాగించాలి

ఆమదాలవలస: కార్మిక ఉద్యమ నేత చాపర అప్పారావు ఆశయాలను కొనసాగించాలని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మి కళ్యాణ మండపం వద్ద వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చాపర 27వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులు చాపర రమేష్, చింతాడ సత్యనారాయణ, సామాజికవేత్త జీవీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే ప్రారంభం

పొందూరు: కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో జిల్లాలో సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే మంగళవారం ప్రారంభమైంది. గ్రామాల్లో వివిధ అవయ లోపాలతో బాధపడుతున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులు(దివ్యాంగులు)ను గుర్తించి వారిని పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో చేర్పించడమే కాకుండా అవసరమైన సదుపాయాలను కల్పించడమే ముఖ్య ఉద్దేశం. ఐఈఆర్టీ సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో అధికారులు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సహాయం తీసుకుంటున్నారు. పొందూరు మండలంలో ఐఈఆర్టీలు కె.దినేష్, రాధ తదితరులు సర్వే నిర్వహిస్తున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధి మొండిగల వీధికి చెందిన పోలుబోతు అప్పలరాము ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ బీమా రూ.లక్ష మంజూరైందని ఈఓ కూర్మారావు తెలిపారు. ఎంపీటీసీ యరకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జోగారావు, నరేష్, ప్రభాకరరావు, కర్రన్న, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోజంతా వర్షం



ఎల్.ఎన్.పేట: భారీగా కురుస్తున్న వర్షం



ఆమదాలవలస రూరల్: అక్కులపేట వద్ద వరి నారు మడుల్లో చేరిన వర్షం నీరు



సారవకోట: నౌతళ సమీపంలోని పొలాల్లో చేరిన వర్షం నీరు



కొత్తూరు: పొలాల్లో చేరిన వర్షం నీరు

ఎల్.ఎన్.పేట/ఆమదాలవలస రూరల్/కొత్తూరు/సరుబుజ్జిలి/సారవకోట: తుఫాన్ ప్రభావంతో ఎల్.ఎన్.పేట, ఆమదాలవలస, సరుబుజ్జిలి, సారవకోట, కొత్తూరు మండలాల్లో మంగళవారం రోజంతా వర్షం కురుసింది. సోమవారం ఉదయం నుంచి అడపా దడపాగా కురిసిన వర్షం మంగళవారం సాయంత్రానికి ఎక్కువైంది. అంతంత మాత్రంగా నీటితో ఉన్న సాగునీటి చెరువుల్లోకి నీరు చేరింది. వరి నారు మడులు, వెద పొలాలు వర్షం నీటితో నిండాయి.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

పాతపట్నం: విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు అన్నారు. స్థానిక శ్రీవిద్యానికేతన్ జూనియర్ కళాశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నీట్-2023లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన కాణి యశశ్రీ, యాబాజీ జాహ్నవికి మంగళవారం విద్యా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించారు. పి.రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, యజ్జల భాస్కరరావు, ఎం.కృష్ణమూర్తి, కె.కుసుమకుమారి, శాంతి రాజు, రమాలత, అధ్యాపకులు పాల్గొన్నారు.